ప్రజాశక్తి
శుక్రవారం 7 జూన్ 2024
5
విజయనగరం

చంద్రబాబును కలిసిన కలిశెట్టి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు గురువారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలిశెట్టికి చంద్రబాబు స్వీట్ తినిపించారు. కనకదుర్గమ్మ ఆలయంలో కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

– ప్రజాశక్తి, విజయనగరంకోట

కలిశెట్టికి స్వీట్ తినిపిస్తున్న చంద్రబాబునాయుడు

గ్రంథాలయాలపై బకాయిల గుదిబండ

గ్రంథాలయాల నిర్వహణ గాడి తప్పింది. విజ్ఞాన భాండాగారాలుగా చెప్పకునే గ్రంథాలయాలు నీరసించి పోతున్నాయి. సెస్ బకాయిలు రాక.. పక్కా భవనాలు లేక.. పాఠకులకు మౌలిక సౌకర్యాలు కల్పించలేక.. పుస్తకాలూ పూర్తిస్థాయిలో అందించలేక.. కునారిల్లుతున్నాయి. గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలన్న తలంపు ప్రభుత్వానికి కరువైంది. గ్రంథాలయాల నిర్వహణకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న స్థానిక సంస్థల సెస్సు వసూలు పూర్తిగా పడకేసింది.

జిల్లా కేంద్ర గ్రంథాలయం

రూ.5 కోట్ల సెస్ బకాయి ● అత్యధికం మున్సిపాలిటీల నుంచే

ప్రజాశక్తి-విజయనగరంకోట

గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం. ఇక్కడ చదువుకొని ఎంతోమంది యువత ఉద్యోగాలు సంపాదిస్తూ ఉంటారు. దిన, వార, మాస పత్రికలతోపాటు పోటీ పరీక్షల పుస్తకాలు, కథలు, ఇతిహాసాల పుస్తకాలను పిల్లల నుంచి యువత, పెద్దలు చదువుతూ విజ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటారు. అటువంటి విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాల అభివృద్ధికి ముఖ్యమైనది సెస్. ఉమ్మడి విజయనగరం జిల్లాలో గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం, మూడు గ్రామీణ, 37 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి నిర్వహణలో స్థానిక సంస్థల నుంచి వచ్చే సెస్సే కీలకం. గ్రంథాలయాల నిర్వహణకు స్థానిక సంస్థలు 8 శాతం సెస్సు అందివ్వాలి. గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నివాసం ఉంటున్న ఇళ్ల పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో ఈ 8 శాతం నిధులను జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలి. జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణకు నెలకు లక్షల్లో వ్యయమయ్యే పరిస్థితి. కానీ ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం సాయం అందించడం లేదు.

సిబ్బంది అరకొరే

జిల్లాలోని గ్రంథాలయాలు ఉద్యోగుల కొరతతో ఊగిసలాడుతున్నాయి. జిల్లాలో గ్రేడ్-1 లైబ్రరీగా విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉంది. గ్రేడ్-2లో పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, శృంగవరపుకోట గ్రంథాలయాలు ఉన్నాయి. మిగతావి గ్రేడ్-3 గ్రంథాలయాలు. ఇందులో 30 గ్రంథాలయాలకు మాత్రమే ప్రభుత్వ కొలువులు ఉన్నాయి. మిగతా గ్రంథాలయాలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 14 పోస్టులు ఉన్నాయి. లైబ్రేరియన్-8, రికార్డు అసిస్టెంట్-1, హెల్పర్-5 పోస్టులు అవుట్ సోర్సింగ్‌లో నడుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా నెల్లిమర్ల, కురుపాం, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, భోగాపురం, చీపురుపల్లి, పాచిపెంట, రామభద్రపురం గ్రంథాలయాల్లో పోస్టులు ఖాళీలున్నాయి. 41 గ్రంథాలయాలకు గాను 26 చోట్ల మాత్రమే సొంత భవనాలున్నాయి. 8 అద్దె భవనాలు, 7 అద్దె ఉచిత భవనాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలు సెస్ లేక అభివృద్ధికి ఆమడ దూరంలో కొనసాగుతున్నాయి.

ఏళ్ల తరబడి బకాయి

గ్రంథాలయ నిర్వహణకు సంబంధించి స్థానిక సంస్థల నుంచి సెస్ బకాయిలే వసూలు కావడం లేదు. జిల్లాలో సుమారు రూ.5 కోట్ల సెస్ బకాయి ఉండటమే అందుకు నిదర్శనం. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మేజర్, మైనర్ పంచాయతీల నుంచి రూ1.50 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. బొబ్బిలి మున్సిపాలిటీ నుంచి ఎప్పటికప్పుడు సెస్ చెల్లిస్తూ వస్తున్నారు. సాలూరు మున్సిపాలిటీ నుంచి రూ.40 లక్షలు, పార్వతీపురం నుంచి రూ.16 లక్షలు, నెల్లిమర్ల నుంచి రూ.26 లక్షలు రావాల్సి ఉంది. అత్యధికంగా విజయనగరం కార్పొరేషన్ నుంచి రూ.3 కోట్ల బకాయిలు ఉండగా, పలుమార్లు గ్రంథాలయ అధికారులు మున్సిపల్ కార్పొరేషన్‌కు, స్థానిక నాయకులకు వినతులు అందజేశారు. ఎన్నికల కోడ్ దగ్గర్లో ఉండగా, కార్పొరేషన్ నుంచి రూ.50 లక్షలు మాత్రమే అందజేశారు. ఇంకా రూ.2.50 కోట్ల మేర కార్పొరేషన్ నుంచి బకాయి ఉంది. ఈ బకాయిలు రాక గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోలేదు. గ్రంథాలయ ఉద్యోగుల జీతభత్యాలకు రాష్ట్ర ప్రభుత్వం కొంత చెల్లించినా, మరికొంత డబ్బులు సంస్తే కలుపుకొని వేతనాలు అందిస్తోంది.

కనీస సౌకర్యాలైన కూర్చునేందుకు కుర్చీలు, టేబుళు కొన్ని గ్రంథాలయాల్లో లేవంటే ఏ విధంగా కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

సెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

గ్రంథాలయాలు అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా సెస్సే ఆధారం. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నా, పుస్తకాలు ఏర్పాటు చేయాలన్నా స్థానిక సంస్థల నుంచి వచ్చే ఆదాయమే కీలకం. జిల్లాలో సుమారు ఐదు కోట్ల రూపాయలు సెస్ రావాల్సి ఉంది. దీంతో భవన నిర్మాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం సంవత్సరానికి కొంత మొత్తం జీతాలు కింద ఇస్తే దానికి సెస్ జోడించుకుని వేతనాలు చెల్లిస్తున్నాం. సాధారణ పుస్తకాలను ప్రతి సంవత్సరం బడ్జెట్ పెడితే ప్రభుత్వమే ఇస్తుంది. జిల్లాలో ఖాళీలున్న గ్రంథాలయాల్లో ఉద్యోగులను ప్రభుత్వం నియమించాల్సి ఉంది.

– బి.లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పేరు మారుస్తున్న టిడిపి కార్యకర్తలు

సర్వజన ఆస్పత్రి బోర్డు మార్పు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బోర్డును గురువారం సాయంత్రం టిడిపి నాయకులు మార్చారు. మహారాజా ప్రభుత్వ ఆస్పత్రిగా కొత్త బోర్డు తగిలించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు ఆధ్వర్యాన ఆ పార్టీ కార్యకర్తలు భారీగా ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బోర్డును తొలగించి, కొత్తది బోర్డు ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ ఎస్‌ఐలు నవీన్ పడాల్, నరేష్.. సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా పేరు మార్చడం సరికాదని ఎస్ఐలు చెప్పగా, ప్రజల కోరిక మేరకు మార్చామని టిడిపి నాయకులు బదులిచ్చారు. మహారాజా జిల్లా కేంద్ర ఆస్పత్రిగా ఉన్న పేరును గత ప్రభుత్వం 2022 అక్టోబరు ఆరో తేదిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మార్చిన విషయం విదితమే.

పెద్దగెడ్డను పరిశీలించిన జైకా బృందం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ రిజర్వాయర్ గురువారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జైకా బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌కు సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని జైకా కన్సల్టెన్సీ కో టీం లీడర్ సాప్ జాన్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు అలాగే స్పిల్‌వే ప్రధాన గేట్లు పరిశీలించి గేట్లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. నీరు విడుదల సమయంలో గేట్లు ఎత్తివేతకు ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా మెకానిక్ ఇంజనీర్లతో చర్చించి సరి చేసుకోవాలని సూచించారు. అలాగే కాలువల పనులు నిలుపుదలపై అధికారులను ప్రశ్నించారు. గుత్తేదారులకు బకాయిలు నిలిపివేయడంతో పనులను నిలిపివేశారని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఇ వైవి రాజరాజేశ్వరి. ఇఇ ఆర్.అప్పలనాయుడు, డిఇలు కనకారావు, లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయరును పరిశీలిస్తున్న జైకా ప్రతినిధులు

పడిలేచిన టిడిపి

● ఉమ్మడి విజయనగరం జిల్లాలో 1983 నుంచి టిడిపిదే హవా ● రెండు సార్లు క్లీన్‌స్వీప్ ● అత్యధికంగా విజయనగరంలో, ఎస్.కోటలో ఎనిమిది సార్లు ● బొబ్బిలిలో కాంగ్రెస్, వైసిపిలతో ఢీ

టిడిపి ఆవిర్భావం నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆ పార్టీదే హవా సాగింది. మధ్యలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నా.. ప్రస్తుత ఎన్నికల ఫలితాలు పడిలేచిన కెరటాలను తలపించాయి. గత 2019 ఎన్నికల్లో వైసిపి క్లీన్‌స్వీప్ చేసినప్పటికీ, అంతకు ముందు, ఆ తరువాత కూడా టిడిపి అదే రికార్డులను సృష్టించింది. 1994 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మొత్తం 12 స్థానాల్లోనూ టిడిపి ఎమ్మెల్యేలు గెలిచిన రికార్డు ఉంది. ప్రస్తుత ఎన్నికల్లోనూ అదే రకమైన ఫలితాలు వెలువడ్డాయి. 1983లో టిడిపి ఏర్పాటు నుంచి నేటి వరకు 10 సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కురుపాం, బొబ్బిలి మినహా దాదాపు అన్ని ఎన్నికల్లోనూ టిడిపినే ఎక్కువ సీట్లు సాధించింది. ఇందులో అత్యధికంగా విజయనగరం, ఎస్.కోట నియోజకవర్గంలో ఎనిమిది సార్లు, నెల్లిమర్ల నియోజకవర్గంలో ఏడు సార్లు విజయఢంకా మోగించింది. ఈ క్రమంలో పూసపాటి అశోక్ గజపతిరాజు, పతివాడ నారాయణ స్వామి నాయుడు ఎక్కువ సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రికార్డులు సృష్టించారు. అదే స్థాయిలో మంత్రి పదవులను కూడా అలంకరించారు. నియోజకవర్గాల వారీగా ఒక్కసారి పరిశీలిస్తే..

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

విజయనగరంలో ఎనిమిది సార్లు విజయం

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో 1983 నుంచి 1999 వరకు జరిగిన ఐదు ఎన్నికల్లో పూసపాటి అశోక్ గజపతిరాజు ఓటమి ఎరుగని యోధుడిగా విజయం సాధించారు. 2004లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కోలగట్ల వీరభద్రస్వామి చేతిలో ఓడిపోయినా, 2009 ఎన్నికల్లో తిరిగి స్వామిపైనే విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో టిడిపి తరపున మీసాల గీత ఎన్నికయ్యారు. 2019లో తిరిగి వైసిపి తరపున వీరభద్రస్వామి ఎన్నికై, ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి (అశోక్ కుమార్తె) అదితి విజయలక్ష్మి గజపతిరాజు చేతిలో 60,609 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. ఈ రకంగా చూసినప్పుడు టిడిపి ఆవిర్భావం తరువాత ఒక దఫా స్వతంత్ర అభ్యర్థిగా, మరో దఫా వైసిపి అభ్యర్థిగా స్వామి మాత్రమే గెలిచారు. మిగిలిన 8 ఎన్నికల్లోనూ టిడిపి హవా కొనసాగించింది. మరో మాటలో చెప్పాలంటే టిడిపి ఏర్పడ్డాక ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ కనుమరుగైంది.

టిడిపికి కంచు'కోట'

శృంగవరపుకోటలో టిడిపి మొత్తం ఎనిమిది సార్లు గెలిచింది. 1983 నుంచి 1999 వరకు జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున ఎల్‌బి దుక్కు ఓటమి ఎరుగని ఎమ్మెల్యేగా ముందుకు సాగారు. 1999లో టిడిపి తరపున శోభా హైమావతి గెలిచారు. ఆ తరువాత 2004లో కాంగ్రెస్ నుంచి కుంభా రవిబాబు గెలిచినప్పటికీ, 2009, 2014 ఎన్నికల్లో కోళ్ల లలితకుమారి వరుసగా రెండుసార్లు టిడిపి తరపున గెలిచారు. గత ఎన్నికలో వైసిపి అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావుపై ఓడినప్పటికీ, అదే అభ్యర్థిపై తిరిగి లలితకుమారి విజయం సాధించారు. ఇలా ఈ నియోజకవర్గంలో ఒకసారి కాంగ్రెస్, మరోసారి వైసిపి మినహా మిగిలిన 8 సార్లు టిడిపి హవాయే కొనసాగింది.

నెల్లిమర్లలో జనసేన బోణీ

టిడిపి, జనసేన పొత్తులో భాగంగా నెల్లిమర్ల నుంచి జనసేన బోణీ కొట్టింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో జనసేన తరపున పోటీచేసిన లోకం నాగమాధవి గెలుపొందారు. ఈ నియోజకవర్గంలోనూ టిడిపి సుదీర్ఘకాలం హవా కొనసాగించింది. ప్రస్తుత నెల్లిమర్ల నియోజకవర్గ పరిధి గతంలో సతివాడ, భోగాపురంగా విస్తరించి కూడా ఉండేది. నియోజకవర్గ పేర్లు మారినా ఇక్కడ 1983 నుంచి 2004 వరకు వరుసగా ఆరుసార్లు పతివాడ నారాయణ స్వామినాయుడు విజయబావుట ఎగురవేశారు. ఆ తరువాత 2009లో కాంగ్రెస్ తరపున పోటీచేసిన బడ్డుకొండ అప్పలనాయుడి చేతిలో నారాయణ స్వామినాయుడు ఓటమి చవిచూసినా, 2014 ఎన్నికల్లో ఆయనే నెగ్గారు. 2019లో తిరిగి ఓడిపోయారు. ఇలా వీరి మధ్య 2009, 2014, 2019 ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు పోటీ ఏర్పడింది. తాజాగా ఆ స్థానంలో టిడిపి అండతోనే జనసేన విజయం సాధించింది.

చీపురుపల్లి టిడిపికే అడ్డా

చీపురుపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఏడు సార్లు టిడిపి, రెండు సార్లు కాంగ్రెస్, ఒకసారి వైసిపి విజయం సాధించాయి. 1983 నుంచి 1999 వరకు జరిగిన ఎన్నికల్లో వరుసగా టిడిపి హవా కొనసాగించింది. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున బొత్స సత్యనారాయణ గెలిచి వివిధ మంత్రి పదవులను అలంకరించారు. 2014లో టిడిపి అభ్యర్థి కిమిడి మృణాళిని చేతిలో బొత్స ఓటమి చవిచూశారు. ఆ తరువాత వైసిపి తరపున పోటీచేసి టిడిపి అభ్యర్థి కిమిడి నాగార్జునపై విజయం సాధించి, తాజాగా టిడిపి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు చేతిలో ఓడిపోయారు.

గజపతినగరంలో ఆరుసార్లు విజయకేతనం

గజపతినగరం నియోజకవర్గంలో టిడిపి ఆరుసార్లు విజయకేతనం ఎగురవేసింది. 1983లో టిడిపి, 1985లో కాంగ్రెస్ గెలిచాయి. ఆ తరువాత 1989, 1994 ఎన్నికల్లో టిడిపి తరపున పడాల అరుణ విజయకేతనం ఎగరవేశారు. 1999లో టిడిపి ఓటమి పాలైనా, 2004లో మరోసారి పడాల అరుణ గెలిచారు. ఆ తరువాత 2009లో కాంగ్రెస్ తరపున బొత్స అప్పలనర్సయ్య గెలిచినప్పటికీ 2014లో టిడిపి అభ్యర్థి కెఎ నాయుడుపై ఓడిపోయారు. 2019లో అదే కెఎ నాయుడిపై కాంగ్రెస్ తరపున తిరిగి అప్పలనర్సయ్య విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ చేతిలో వైసిపి అభ్యర్థి అప్పలనర్సయ్య ఓడిపోయారు.

బొబ్బిలిలో పాతికేళ్ల తరువాత

బొబ్బిలిలో టిడిపి పడిలేచింది. ఈ నియోజకవర్గంలో టిడిపి మొత్తంగా నాలుగు సార్లు విజయం సాధించినా, అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1999 ఎన్నికల తరువాత ఇదే మొదటి గెలుపు. 1983, 1985లో టిడిపి తరపున పోటీ చేసిన శంబంగి వెంకట చినప్పలనాయుడు వరుసగా రెండుసార్లు గెలిచారు. ఆ తరువాత 1989 కాంగ్రెస్ అభ్యర్థి పెద్దింటి జగన్మోహన్‌రావు చేతిలో ఓడినప్పటికీ, తిరిగి 1994 ఎన్నికల్లో శంబంగి విజయం సాధించారు. ఆ తరువాత మూడు దఫాలు కాంగ్రెస్, మరో రెండు దఫాలు వైసిపి విజయం సాధించింది. సుదీర్ఘకాలం తరువాత వైసిపి అభ్యర్థి శంబంగిపై ఆర్‌విఎస్‌కెకె రంగారావు (బేబినాయన) టిడిపి తరపున విజయం సాధించారు.

టిడిపి విజయంతో ఎస్.కోటలో సంబరాలు చేసుకుంటున్న ఆ పార్టీ కార్యకర్తలు (ఫైల్)

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు నాగార్జున

కూటమి విజయం ప్రజల సొంతం

టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

కూటమి విజయం ప్రజల సొంతమని టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎమ్మెల్యే అదితి గజపతి రాజు తెలిపారు. గురువారం స్థానిక అశోక్ బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ ప్రజా తీర్పు ఏమిటనేది ఈ ఎన్నికల్లో చూశామన్నారు. దౌర్జన్యాలు చేసే నాయకులను ప్రజలు ఇంటికి పంపారని తెలిపారు. ఐదేళ్లలో టిడిపి నాయకులను ఎన్నో ఇబ్బందులు పెట్టారని చెప్పారు. జిల్లాలో కూటమి విజయానికి సహకరించిన ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లలో జిల్లాలో అనేక పోరాటాలు చేశామన్నారు. కేసులు పెట్టినా భయపడకుండా ముందుకు సాగామని గుర్తుచేశారు. బొత్స సత్యనారాయణ ఓడించలేని నాయకుడు ఏమి కాదని, చీపురుపల్లిలో తమ నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో భయభ్రాంతులకు గురిచేసి నెగ్గారని తెలిపారు. మెరకముడిదాం మండలంలో టిడిపి 10 వేల ఓట్ల మెజారిటీ సాధించిందని తెలిపారు. ఓటమిని ఒప్పుకోలేక బొత్స కవర్ చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ ఘనమైన మెజారిటీ ఇచ్చిన విజయనగరం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు ఐవిపి రాజు, కర్రోతు నర్సింగరావు, గంటా పోలినాయుడు, అవనవు విక్రమ్, కాళ్ల గౌరీశంకర్, లక్ష్మీ వరప్రసాద్, పిల్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవించాలి

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-గరివిడి

ప్రజా తీర్పును అందరూ గౌరవించాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రతిఒక్కరూ మానవత్వ దృక్పథం కలిగి ఉండాలని, పేదలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని చెప్పారు. రెచ్చగొడితే రెచ్చిపోవద్దని, రాత్రి, పగలు రెండూ వస్తాయని వ్యాఖ్యానించారు. గరివిడిలో వైసిపి కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలపై ఎవరూ దిగులు చెందొద్దని, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. ఐదేళ్లపాటు చేసినంతవరకు అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమ, అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. పేదవాడు తలెత్తుకొనేలా కృషి చేశామని వివరించారు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని కోరుకున్నారని, ప్రజా తీర్పును గౌరవిద్దామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి నష్టం కలగకుండా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించే దిశగా అధికారంలోకి వచ్చే ప్రభుత్వం పనిచేస్తుందని ఆకాంక్షించారు. ప్రతిపక్షంలో ఉన్నా సరే పేదలకు అండగా నిలుస్తామన్నారు. తన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, ఏ సమస్య వచ్చినా సరే తనకు ఒక ఫోన్ కాల్ చేస్తే చాలని భరోసానిచ్చారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మనం అందించిన సంక్షేమం, అభివృద్ధి కన్నా మరింత సంక్షేమాన్ని కోరుకున్న ప్రజా తీర్పుని గౌరవిద్దామన్నారు. కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మునుపటిలా అందరి కష్టసుఖాల్లో అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏదేమైనా నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. సమావేశంలో వైసిపి యువ నాయకులు బొత్స సందీప్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

12 నుంచి కొత్త బస్‌పాసులు జారీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఈ నెల 12 నుంచి కొత్త బస్‌పాసులు జారీ చేయనున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాసుల జారీ విధానాన్ని సులభతరం చేసేందుకు గురు, శుక్రవారాల్లో ప్రస్తుతం ఉన్న వెబ్‌సైట్‌ను నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చి, బస్‌పాసులు జారీ చేస్తామని తెలిపారు. విద్యార్థులంతా సహకరించాలని కోరారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రిగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబునాయుడుకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ, జిల్లా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిశోర్, కార్యదర్శి సురేష్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నూతనంగా గెలుపొందిన ఎమ్‌పి, ఎమ్మెల్యేలకు అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని ఆకాంక్షించారు.

సంస్థాగతంగా పార్టీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జై భీమ్‌రావు భారత్ పార్టీని గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సంస్థాగతంగా పటిష్ట పరుస్తామని ఆ పార్టీ జిల్లా నాయకులు మరడాన వెంకటనాయుడు తెలిపారు. గురువారం విజయనగరం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో, మండలాల్లో కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి ప్రోత్సహించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్నం అరుణ్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ట పరిచే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు అద్భుతమైన తీర్పునిచ్చారని అన్నారు. జిల్లాలో గెలిచిన అభ్యర్థులందరికీ తమ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొడుగు రామకృష్ణ, నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు, చింతపల్లి దుర్గారావు, పెంట శంకరరావు, పైల జ్యోతి పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - గుర్ల

వైసిపి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత టిడిపికి ఓటు వేశారన్న అనుమానంతో కొంత మందికి వృద్ధాప్య పింఛన్లను వైసిపి నాయకుల ఒత్తిడితో అధికారులు నిలిపివేశారు. అర్హత ఉన్న లబ్ధిదారులు మండల కార్యాలయం చుట్టు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో వారంతా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పిల్ల అప్పల నాయుడును కలిసి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అర్హత ఉన్న పింఛన్లను తక్షణమే పింఛను సొమ్ము ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సచివాలయ కార్యదర్శులు అగోళియాన నాటి నుంచి నేటి వరకూ మొత్తం డబ్బులను చెక్కు రూపంలో గురువారం చింతలపేట, ఆనందపురం, నడుపూరు, భూపాలపురం గ్రామాలకు చెందిన పింఛన్ దారులకు చెక్కుల రూపంలో అందించారు.

కూటమినేతల చొరవతో తాగునీరు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కూటమి నేతల చొరవతో పూసపాటిరేగలో తాగు నీరు సరఫరాకు ఏర్పాటు చేశారు. మోటారు మరమ్మత్తులతో గతమూడు రోజులుగా తాగు నీటికి గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో కొంత మంది గ్రామస్తులు మూడు రోజులుగా గ్రామంలో తాగునీరు రావడం లేదని కూటమి నేత, గ్రామ మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు, జనసేన నేత మహంతి శివ వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో వారు పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో మాట్లాడి మూడు రోజులుగా ఎందుకు తాగునీరు ఇవ్వడం లేదని అడిగారు. బోరు రిపేరు వచ్చిందని, మెకానిక్‌లు రావడం లేదని తెలిపారు. దీంతో గురువారం కూటమి నేతలు చొరవ తీసుకొని విజయనగరం నుంచి ఒక మెకానిక్‌ను తీసుకువచ్చి దగ్గరుండి బోరు మరమ్మత్తు పనులు చేయించి తాగునీరు ఇప్పించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండు వేసవిలో మూడు రోజులు తాగునీరు లేకపోతే ఏం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి సమస్యను ముందే గుర్తించాల్సిన అవసరం అధికార్లకు లేదా అన్నారు. ఇకపైనా ఇటువంటి సమస్య లేకుండా స్పేర్ మోటార్ ఒకటి ఉంచుకోవాలన్నారు. వారితోపాటు కిలారి సూరిబాబు, బుత్తల అప్పారావు తదితరులు ఉన్నారు.

గిరిజన తెగలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - బాడంగి

పాలవలస గౌరు

ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగలకి చెందిన వారందరూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమికి ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించడం అభినందనీయమని టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ జనరల్ సెక్రెటరీ, ఎపి ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షులు పాలవలస గౌరు అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ చంద్రబాబును మళ్లీ సిఎంను చేసినందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. గిరిజనుల అభివృద్ధికి కూటమి పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పఠనం ద్వారా మేధాశక్తి

ప్రజాశక్తి - కొత్తవలస

విద్యార్థులకు పఠనం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని స్థానిక లైబ్రేరియన్ ఎం.రామలక్ష్మి తెలిపారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా గురువారం ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి బాల్య దశ నుండే అన్ని విషయాలపై పరిజ్ఞానం సంపాదించాలన్నారు. కొత్త విషయాలు నిరంతరం నేర్చుకోవాలని, అప్పుడే తెలియని విషయాలు తెలుసుకుని మేధా శక్తిని పెంచుకోవచ్చునని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించారు.

ఘనంగా జాతీయ వేదిక వార్షికోత్సవం

ప్రజాశక్తి - బొబ్బిలి

తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక మూడవ వార్షికోత్సవ వేడుకలను జాతీయ అధ్యక్షులు డాక్టర్ పి.ఆర్‌విఎస్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో బొబ్బిలి పట్టణంలో స్థానిక సాహితీ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో ఎంతో నిష్ణాతులైన కవులను ఒకే తాటిపై తీసుకువచ్చి వివిధ కవితలతో పాటు చర్చ గోష్టులు నిర్వహించామన్నారు. ఇప్పటికే 157 జూమ్ సమావేశాలను నిర్వహించామన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు పులిపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాష ఈ నాటికీ నిత్య నూతనంగా వెలుగుతుందని కొనియాడారు. ఈ సంస్థ స్థాపించినప్పటి నుండి సాహిత్యం పరంగా కిలపర్తి దాలినాయుడు మాస్టారు, మీసాల చిన్న గౌరి నాయుడు, డాక్టర్ బి రమాదేవి, డాక్టర్ నవనీత రవీందర్, మోటూరి నారాయణరావు సంస్థకు సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ట్రెజరర్, జన దీపిక బొబ్బిలి నియోజకవర్గ విలేకరి కురమాన రామకృష్ణ, పక్కి రమేష్ కుమార్, పట్నాయకుని వేణుగోపాలరావు, అల్లు అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 30 రోజులుగా జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం గురువారం కోలాహలంగా ముగిసింది. ముగింపోత్సవానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, తానవరపు గోవింద, పుణ్యగిరి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ షేక్ వలీఖాన్, సాఫ్ట్వేర్ అల్లు మహాలక్ష్మి, డోకుల నాయుడు, రిటైర్డ్ ఆర్మీ పోరాపు వెంకటరావు, ఎల్లా రావు, రేపాక రాజా, కాపుగంటి సతీష్, సబ్బవరం సతీష్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, రహీం, ఎల్‌వి సత్యనారాయణ, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలను తిలగించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ నెల రోజులుగా జరుగుతున్న బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరానికి క్రీడాకారులకు పాలు, గుడ్డు, షటిల్ కాక్స్, క్రీడా దుస్తులు అందించిన దాతలు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

మానవాళి మనుగడ పర్యావరణంతోనే సాధ్యం

ప్రజాశక్తి - బొబ్బిలి

మానవాళి మనుగడ పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యమని ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ రెసిడెంట్ డాక్టర్ పి.రామ్‌కుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని రోటరీ ఆధ్వర్యంలో అధ్యక్షులు జెసి రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బందితో కలసి బాదం, వేప మొక్కలను నాటరు. అంతర్జాతీయ రోటరీ సంస్థ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తుందని దీనిలో భాగంగా జులై 5వ తేదీ వరకు పర్యావరణ మాసోత్సవాలు రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు. అవగాహన సదస్సులు, మొక్కలు పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తామని పెద్దఎత్తున యువత పాల్గొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిఇఒ ఎస్ శ్రీనివాసన్, మేనేజర్ (ఆపరేషన్) అవినాష్, చంద్రిక, కిరణ్, దుర్గ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించిన వారికి ధన్యవాదాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అందరికి ఆర్ఒ ఎం.నూకరాజు ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి నామినేషన్లు, ప్రచారం, పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని వర్గాల ప్రజలు సహకరించారని తెలిపారు. ఓటు వేసేందుకు ముందుకు వచ్చిన ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైనందుకు ప్రశంసించారు.

కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఓడిపోయామని ఎవరూ అధైర్యపడొద్దని వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు వైసిపి కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తున్నామన్నారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా ప్రజలకు అందజేశారని, నాడు నేడు ద్వారా విద్యా రంగాన్ని అభివృద్ధి చేసారని గుర్తు చేశారు. మండలంలో ఏ అభివృద్ధి చేస్తామని కొత్త ప్రభుత్వం ముందుకు వచ్చినా తమ సహకారం ఉంటుందన్నారు. ఎవరూ అధైర్య పడాల్సిన పని లేదని, గెలుపు ఓటములు సహజమని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. గత ఐదేళ్ల నుంచి తమ వెంటే ఉండి తమకు సహాయ సహకారాలు అందించడంతో పాటు తాజాగా వైసిపి పార్టీకి ఓట్లు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రేవల్ల సత్యనారాయణ, గెరిడి రామదాసు, కె దాలయ్య, కె ఆదినారాయణ, ఎల్ ప్రభాత్ కుమార్, మల్లింపూడి శ్రీనివాసరావు తదితరులున్నారు.

చరిత్ర సృష్టించిన టిడిపి

- 1983 నుంచి జరిగిన 10 ఎన్నికలలో ఏడింట టిడిపి హవా
- 2024లోనూ దూసుకుపోయిన సైకిల్

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లిలో తెలుగుదేశం పార్టీ చరిత్ర సృష్టించింది. అనుకున్నట్టుగానే చీపురుపల్లి అసెంబ్లీలో సైకిల్ దూసుకుపోయింది. గత ఎన్నికల కంటే విభిన్న శైలిలో ఎన్నికల ప్రచారాన్ని కూటమి అభ్యర్థి జనసేన, బిజెపిలతో కలసి ముందుకు తీసుకెళ్లి విజయం సాధించాడు. 1983 నుంచి టిడిపికి కంచు కోటగా ఉండే చీపురుపల్లిని బొత్స ఆక్రమించుకున్నాడని, ఎలాగైనా తిరిగి అక్కడే విజయం సాధించాలనే ఉద్దేశ్యంతో అధినేత చంద్రబాబునాయుడు ఆచితూచి అడుగులు వేసి సీనియర్ నాయకుడైన కిమిడి కళావెంకటరావుని చీపురుపల్లి బరిలో దించారు. గత ఐదేళ్ల నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున ఒక్క కార్యకర్తను కూడా అధికార పార్టీ వైపు వెల్లకుండా తనదైన శైలిలో నిరంతరం ప్రజల మద్యే ఉంటూ ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ ప్రజలలో మమేకమయ్యాడు. ఇవన్నీ గ్రహించిన చంద్రబాబు చీపురుపల్లి అయితే కళావెంకటరావుకు బాగుంటుందని గ్రహించి చివరి క్షణంలో టిక్కెట్‌ని ప్రకటించారు. దీంతో 1983 నాటి చీపురుపల్లిని తిరిగి తెలుగుదేశం పరం చేయాలనే ఉద్దేశ్యంతో టిడిపి నాయకులందరూ కష్టపడి పని చేసి విజయానికి కృషి చేశారు. 1983 నుంచి 2024 వరకు జరిగిన పది అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ 7 పర్యాయాలు విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ రెండు దఫాలు, వైసిపి ఒక దపా విజయం సాధించాయి. 1983 మొట్ట మొదటి సారిగా జరిగిన ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ నుంచి త్రిపురాన వెంకటరత్నం పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ నుండి బరిలో నిలబడ్డ గొర్లె శ్రీరాములనాయుడుపై 23 వేల ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. 1985లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన మీసాల నీలకంఠం నాయుడుపై టిడిపి తరుపున పోటీ చేసిన కెంబూరి రామ్మోహనరావు 27 వేల ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన టంకాల సరస్వతమ్మ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన మీసాల నీలకంఠం నాయుడుపై 10 వేల ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 1994లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన కెంబూరి రామ్మోహనరావుపై టిడిపి తరుపున పోటీ చేసిన గద్దె బాబూరావు 18 వేల ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 1999 జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన గద్దె బాబూరావు కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన మీసాల నీలకంఠం నాయుడుపై 4,500 ఓట్లు మెజార్టీతో విజయం సాధించి తెలుగుదేశం పార్టీ జెండా ఎగుర వేశారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన గద్దె బాబూరావుపై కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణ విజయం సాధించి తెలుగుదేశం పార్టీ హవాకి బ్రేక్ వేశారు. ఈ ఎన్నికలలో బొత్స సత్యనారాయణ 10,800 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. 2009లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణ టిడిపి తరుపున పోటీ చేసిన గద్దె బాబూరావుపై మరోసారి 5,942 ఓట్లు తేడాతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణపై తెలుగుదేశం పార్టీ నుండి పోటీ చేసి కిమిడి మృణాళిని 20,842 ఓట్లు మెజార్టీతో విజయం సాధించి తిరిగి చీపురుపల్లిలో టిడిపి జెండా ఎగుర వేశారు. కాగా ఈ ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసిన బెల్లాన చంద్రశేఖర్ ఓడిపోయారు. 2019లో జరిగిన ఎన్నికలలో వైసిపి తరుపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణ టిడిపి నుంచి పోటీ చేసిన కిమిడి నాగార్జునపై 26,498 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 2024 మేలో జరిగిన ఎన్నికలలో వైసిపి తరుపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణపై కూటమి (తెలుగుదేశం పార్టీ) తరుపున పోటీ చేసి కిమిడి కళావెంకటరావు 11,639 ఓట్లు మెజార్టీతో విజయం సాధించి తిరిగి తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయిన చీపురుపల్లిలో టిడిపి జెండాను ఎగుర వేశారు.

ఓటమితో అంతర్మథనంలో వైసిపి

- ప్రభుత్వ వ్యతిరేకిత, సామాజిక సేవతో టిడిపి విజయం
- అతివిశ్వాసం, నిర్లక్ష్యంతోనే వైసిపి ఓటమి

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గంలో గెలుపు జోష్‌లో టిడిపి ఉండగా ఓటమితో అంతర్మథనంలో వైసిపి నేతలున్నారు. మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి బేబినాయనను నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వైసిపి ఆశలు పెట్టుకోగా ప్రభుత్వ వ్యతిరేకిత, తాను చేసిన సామాజిక కార్యక్రమాలపై టిడిపి అభ్యర్థి బేబినాయన ఆశలు పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లి ప్రజల మద్దతు పొంది అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. దీంతో టిడిపి కేడర్ జోష్‌లో ఉండగా ఓటమితో వైసిపి అంతర్మథనంలో పడింది.

ప్రభుత్వ వ్యతిరేకిత, సామాజిక సేవతో టిడిపి విజయం

నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో బేబినాయన విజయానికి ప్రభుత్వ వ్యతిరేకత, బేబినాయన చేసిన సామాజిక కార్యక్రమాలు తోడయ్యాయి. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. దీంతో పట్టణ, గ్రామాల్లో ప్రజలు తాగునీరు, రోడ్లు, కాలువల, సాగునీటి సమస్యలతో బాధపడ్డారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిండంలో విఫలమయ్యారు. దీంతో ప్రజలు వైసిపికి వ్యతిరేకంగా ఓట్లు వేసి టిడిపికి అండగా నిలబడ్డారు. బేబినాయన 1999 నుంచి బొబ్బిలి నియోజకవర్గంతో పాటు పక్క నియోజకవర్గాల్లో కూడా సామాజిక కార్యక్రమాలు చేశారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు నిర్మాణానికి ఆర్థిక సహకారం చేయడంతో పాటు పేద విద్యార్థులు చదువుకు, పేదల వైద్యానికి ఆర్థిక సహకారం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణానికి కూడా అండగా ఉండే వారు. పట్టణ, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చేతిపంపు బోర్లు వేసి తాగునీరు అందించారు. 2019లో వైసిపిలో అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆకలి తీర్చే అన్నా కేంటీన్ మూసివేయడంతో సొంత నిధులతో అన్నా కేంటీన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చారు. రెండున్నర దశబ్దాల కాలం నుంచి ప్రజలకు అండగా ఉండి సామాజిక కార్యక్రమాలు చేయడంతో బేబినాయనను ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించారు.

అతివిశ్వాసం వైసిపి ఓటమికి కారణం

నియోజకవర్గంలో వైసిపి ఓటమికి అతివిశ్వాసం, గ్రూపు రాజకీయాలే కారణమని చర్చ జరుగుతోంది. 2019 ఎన్నికల్లో రాజులను ఓడించాలని కక్షితో మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పని చేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో బొత్స, చిన్నశ్రీను గ్రూపులున్నాయి. వీరంతా కష్టపడి పని చేశారు. వైసిపి విజయం తర్వాత బొత్స, చిన్నశ్రీను గ్రూపుపై నిర్లక్ష్యం చేశారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. మూడేళ్ల క్రితం జరిగిన వినాయక నిమజ్జనం ఉత్సవాలు కోరాడవీధిలో జరుగుతున్న సమయంలో చిన్నశ్రీను గ్రూపుగా పేరున్న ప్రస్తుత వైసిపి జెసిఎస్ పట్టణ కన్వీనర్ విస్సు, ఏడో వార్డు కౌన్సిలర్ దిబ్బ సునీత భర్త గోపి పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించినా చిన్నశ్రీను గ్రూపు అనే కారణంతో ఎమ్మెల్యే పూర్తిగా పట్టించుకోలేదని విమర్శలు కూడా ఉన్నాయి. 2019 ఎన్నికల తర్వాత బొత్స, చిన్నశ్రీను గ్రూపుని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వారంతా ఎన్నికల్లో ఇష్టపూర్వకంగా పని చేయలేదని విమర్శలు కూడా ఉన్నాయి. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామంలో పాత వైసిపి గ్రూపు, టిడిపి నుంచి వైసిపిలో చేరిన గ్రూపు మధ్య ఆధిపత్య పోరు జరిగినప్పటికీ రెండు వర్గాల మధ్య ఉన్న పోరును సద్దుమణిగించేందుకు చర్యలు తీలుకోలేదు. దీంతో ఉద్దవోలు గ్రామాభివృద్ధికి పని చేసిన ఒక గ్రూపునకు చెందిన ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ హత్యకు గురయ్యారు. దీంతో రెండు గ్రూపులూ వైసిపికి దూరమయ్యాయి. బొబ్బిలి మండలం అలజంగి గ్రామ సర్పంచ్ పదవి ఎస్‌సి రిజర్వేషన్ కావడంతో అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పొట్నూరు లక్ష్మునాయుడు ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తను పోటీకి పెట్టి గెలిపించారు. వార్డు మెంబర్‌గా లక్ష్మునాయుడు పోటీ చేసి విజయం సాధించి ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన కొన్ని రోజులు తర్వాత సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య ఆధిపత్య పోరు జరిగింది. దీనిని కూడా నిర్లక్ష్యం చేయడంతో ఉప సర్పంచ్ లక్ష్మునాయుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఇదే పరిస్థితి చాలా గ్రామాల్లో ఉన్నప్పటికి పట్టించుకోలేదని విమర్శలు వచ్చాయి. సర్పంచులు, ఎంపిటిసిలు చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడంలో విఫలం కావడం, సంక్షేమ పథకాలు అమలులో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు జోక్యం లేకపోవడంతో వైసిపిపై అసంతృప్తి చెందిన వారంతా 2024 ఎన్నికల్లో వైసిపికి అనుకూలంగా పని చేయకుండా సైలెంట్‌గా ఉండిపోయారు. దీంతో వైసిపి భారీ ఓట్లు తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. వైసిపి ఓటమితో కేడర్ స్తబ్దతగా ఉంది.

బడ్డుకొండకు అచ్చిరాని 'ఫోర్'

- 2009, 2019లో గెలుపు
- 2014, 2024 లో ఓటమి

ప్రజాశక్తి - భోగాపురం

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు సంవత్సరంలోని చివరి నాలుగో నెంబరు అచ్చిరావడం లేదు. కేవలం చివరి నెంబరు తొమ్మిది మాత్రమే ఆయనకు అచ్చొచ్చింది. ఎందుకంటే 2009, 2019లో ఆయన ఎమ్మెల్యేగా గెలవగా 2014, 2024లో ఓటమి పాలయ్యారు. దీంతో ఆయన మళ్ళీ 2029లో ఎమ్మెల్యేగా గెలుపొందుతారని ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు చర్చించుకుంటున్నారు. 2009లో అనూహ్య పరిణామాల మధ్య కాంగ్రెస్ నుంచి బడ్డుకొండకు ఎమ్మెల్యే టికెట్ లభించింది. దీంతో ఆ సంవత్సరంలో ఆయన టిడిపి అభ్యర్థి పతివాడ నారాయణస్వామినాయుడుపై గెలుపొందారు. అనంతరం జగన్ మోహన్ రెడ్డి పార్టీ పెట్టిన తరువాత 2014లో మళ్ళీ కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. అప్పుడు పతివాడ నారాయణస్వామినాయుడు గెలుపొందారు. అనంతరం 2019లో మళ్ళీ వైసిపి నుంచి టికెట్ రావడంతో సుమారు 29వేల ఓట్లతో మరోసారి బడ్డుకొండ విజయం సాధించి ఉత్తరాంధ్రలోనే అత్యధిక మెజార్టీ సాధించిన ఎమ్మెల్యేగా పేరొందారు. మళ్ళీ ఇప్పుడు 2024లో పోటీ చేయగా ఇప్పుడు మళ్ళీ ఓటమి పొందారు. దీంతో ఆయనకు సంవత్సరంలోని చివరి నెంబరు 4 అచ్చిరాలేదని ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అనుకుంటున్నారు.

నాలుగు సార్లు నాలుగు పార్టీలకు పట్టం

నియోజవర్గం పునర్విభజన తర్వాత ఇప్పటి వరకు నాలుగు సార్లు ఎన్నిలు జరగగా నియోజకవర్గ ప్రజలు నాలుగుసార్లు కూడా నాలుగు వేరువేరు పార్టీలను గెలిపించారు. నియోజవర్గం పునర్విభజన తర్వాత 2009లో మొట్ట మొదటిసారి కాంగ్రెస్‌ను గెలిపించారు. 2014లో తెలుగుదేశం పార్టీని 2019లో వైసిపిని గెలిపించారు. ప్రస్తుతం 2024లో జనసేనను గెలిపించడం విశేషం. ఇందులో బడ్డుకొండ అప్పలనాయుడు రెండుసార్లు, పతివాడ నారాయణస్వామి నాయుడు, లోకం మాధవి చెరొకసారి గెలుపొందారు.

దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బేబినాయన దృష్టి పెట్టాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు కోరారు. కోటలో గురువారం బేబినాయనను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పట్టణంలో రోడ్ల విస్తరణ పూర్తి చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని బేబినాయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బేబినాయనకు అభినందనలు వెల్లువ

టిడిపి ఎమ్మెల్యే బేబినాయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కోటలో గురువారం బేబినాయన కూటమి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. బేబినాయనను బ్రహ్మకుమారీలు కలిసి సత్కరించారు. ఎస్‌టియు నాయకులు జోగారావు, ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు. కోట రెండో రోజు కూడా అభిమానులు, కార్యకర్తలతో కిటకిటలాడింది.

రామభద్రపురం: అధికారంలో లేకపోయినా అభివృద్ధిలో పాలు పంచుకొని ప్రజాసేవే పరమావధిగా అనేక సేవా కార్యక్రమాలు చేసి నేడు అత్యంత ప్రజాదరణతో అఖండ మెజారిటీ సాధించిన బేబీ నాయన బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ప్రజా విజయంగా భావిస్తున్నామని ప్రపంచ ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వరరావు అన్నారు. మండల సంఘం నాయకులతో కలిసి గురువారం బొబ్బిలి కోటలో బేబీ నాయనకు దుశ్శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆరికతోట సంఘ నేతలు పూసర్ల బాబ్జీ, బోసు మాట్లాడుతూ గ్రామంలో నాయన పేరే ఒక వైబ్రేషన్ అని అధికార పార్టీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా తమ గ్రామంలో సుమారు 400 పై చిలుకు ఓట్లు మెజారిటీ రావడం వారి సేవలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, రామకృష్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలలో చేర్పించండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

బడి ఈడులో ఉన్న వికలాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాశాఖధికారి -2 బి. పాపి నాయుడు కోరారు. విద్యాశాఖ - సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లాలో వికలాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక నమోదు కార్యక్రమం గత నెల 9వ తేదీ నుండి జరుగుతోంది. ఇందులో భాగంగా మండలంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని గురువారం ఎంఇఒ పూసపాటిపాలెంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగ పిల్లలు సాధారణ పిల్లలతో సమానంగా కలిసి విద్య నేర్చుకోవాలన్నారు. ఇందుకోసం పాఠశాలలో వీరికోసం ప్రత్యేక సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. మండల కేంద్రంలో ఈ పిల్లల కోసం భవిత కేంద్రం నిర్వహిస్తున్నామని, ఇక్కడ వికలాంగ విద్యార్థుల మేధా స్థాయికి అనుగుణంగా బోధన జరుగుతుందని అన్నారు. వీటితో పాటు పిల్లలకు పలు రకాల ఉపకార వేతనాలు, ఉపకారణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి బుధవారం భవిత కేంద్రంలో శారీరక వైకల్యం ఉన్న పిల్లలకు ఫిజియో థెరిప చేస్తారన్నారు. వికలాంగ పిల్లలకు అందుతున్న ఈ సేవలను సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఎన్.బంగారు నాయుడు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ పాపినాయుడు

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

వేపాడ: మండలంలోని జాకేరులో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఆ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు గురువారం ఇంటింటికీ తిరిగారు. సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు సహకారంతో ప్రతి ఇంటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు భవిష్యత్తులో మంచి విద్యావంతులుగా ఎదిగే అవకాశాన్ని తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ యూపి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ భవన ఏర్పాట్లు చేయండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కూలిపోయిన పాఠశాల భవనం ఇదే..

మండలం లోని పెద్దనడిపల్లి గ్రామంలో పాఠశాల పైకప్పు కూలిపయిందని పాఠశాలకు ప్రత్యామ్నాయ భవన ఏర్పాటు చేయాలని జనసేన మండల అధ్యక్షులు జలపారి అప్పడుదొర(శివ) కోరారు. పాఠశాల భవనం కూలిపోయిందన్న విషయం తెలుసుకున్న జనసేన నాయకులు గురువారం అక్కడికి చేరుకుని పరిశీలించారు. అదృష్టవశాత్తూ కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రహించి వెంటనే మండల విద్యాశాఖ అధికారి రాజ్ కుమారుకి కూలిన పాఠశాల భవనం గురించి వివరించి విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో సదరు గ్రామ పాఠశాల భవనానికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయేది వర్షాకాలం కాబట్టి విద్యాసంవత్సరంలో అన్ని గ్రామాల్లో పాఠశాల భవనాల పరిస్థితి గురించి సమీక్షలు జరిపి శిథిలావస్థలో ఉన్న పాఠశాలల మరమ్మతులు, అవసరం ఉన్నచోట పున నిర్మాణాలు చేపట్టేందుకు నివేదిక తయారు చేసి తక్షణమే భవన సమస్యలపై పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బూర్లె విజయశంకర్, పులపా జగదీష్, లంకలపల్లి బుజ్జి, పులపా మధు, బలభద్రుని జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపకార వేతనానికి ఎంపిక

ప్రజాశక్తి - వేపాడ

సోంపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం.హాసిని ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనానికి అర్హత సంపాదించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పి.ఎ.రాజు తెలిపారు. ఈ విద్యార్థినికి ప్రస్తుత ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఏటా 12వేల రూపాయల ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురష్కరించుకొని సీనియర్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, తల్లిదండ్రులు, ఇతర ఉపాధ్యాయులు ఈ విద్యార్థినిని అభినందించారు. ప్రత్యేక తర్ఫీదు ఇచ్చిన గణిత, సామాన్య, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ అభినందించారు.



ఎస్‌కోట: అశోక్‌ను కలిసిన ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టిడిపి ఎమ్మెల్యేలను పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలుపుతున్నారు. ఉండవల్లిలో చంద్రబాబును రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ కలిశారు. విజయనగరంలో కోళ్లలితకుమారి అశోక్ గజపతిరాజును కలిసి అభినందనలు తెలిపారు. బొబ్బిలిలో బేబినాయనను గజపతినగరం ఎమ్మెల్యే శ్రీనివాస్ కలిసి మిఠాయిలు తినిపించుకున్నారు.

విజయనగరం కోట: ఎమ్మెల్యే అదితిని కలిసిన మహిళా నాయకులు

రామభద్రపురం: ఎమ్మెల్యే బేబినాయనను సత్కరిస్తున్న నాయకులు

రేగిడి: ఉండవల్లిలో చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కోండ్రు మురళీ

బొబ్బిలి: శ్రీనివాస్‌కు మిఠాయి తినిపిస్తున్న నాయన